సాక్షి
రాజన్న సిరిసిల్ల
గురువారం । 27 । మార్చి । 2025



ఖాళీ బిందెలతో నిరసన

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్‌లోని ఎస్సీ కాలనీలో ఐదు రోజులుగా నల్లా నీరు రావడం లేదని మహిళలు బుధవారం నిరసన తెలిపారు. ఖాళీ బిందెలతో రోడ్డుపై బైటాయించారు.



వికసించిన తామరలు

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి నాంపల్లి శివారులోని వేములవాడ-కరీంనగర్ ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న గుడికుంటలో తామరపువ్వులు వికసించాయి.



	ఇఫ్తార్ గురువారం (సా॥)	సహర్ శుక్రవారం (ఉ॥)
కరీంనగర్ :	6.30	4.55
పెద్దపల్లి :	6.35	4.53
సిరిసిల్ల :	6.29	5.03
జగిత్యాల :	6.35	4.53

న్యూస్‌రీల్

క్రీడలతో ఒత్తిడిని అధిగమించొచ్చు

- ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి
- డీఎస్పీ కార్యాలయంలో షటిల్ కోర్టు ప్రారంభం



వేములవాడ: విధి నిర్వహణలో నిత్యం బిజీగా ఉండే పోలీసులు క్రీడలపై దృష్టి సారిస్తే విధుల్లోని ఒత్తిడిని అధిగమించవచ్చని ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి పేర్కొన్నారు. డీఎస్పీ కార్యాలయంలో షటిల్‌కోర్టును బుధవారం ప్రారంభించారు. అనంతరం సీఐలు, ఎస్సైలతో షటిల్ ఆడారు. సీఐలు వీరప్రసాద్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, ఎస్సైలు మారుతి, రమేశ్, అంజయ్య, అశోక్, పృథ్వీధర్‌గౌడ్, ప్రశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారత నౌకాదళానికి ఎంపిక



వివేక్‌వర్ధన్

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని కొండాపూర్‌కు చెందిన గొల్లపల్లి వివేక్‌వర్ధన్ భారత నౌకాదళానికి ఎంపిక య్యాడు. గ్రామానికి చెందిన గొల్లపల్లి దేవరాజుగౌడ్-లత దంపతుల కుమారుడు హైదరాబాద్‌లో డిగ్రీ మూడో సంవత్సరం చదువుతూ పరీక్ష రాశాడు. భారత నౌకాదళంలో ఎస్ఎస్ఆర్‌గా ఉద్యోగానికి ఎంపికయ్యాడు. తండ్రి దేవరాజు గ్రామంలో గీతకార్మికునిగా పనిచేస్తుండగా తల్లి లత బీడీ కార్మికురాలు. వివేక్‌వర్ధన్ భారత నౌకాదళానికి ఎంపిక కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలి



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కాయకల్ప బృందం వైద్యులు మంజుల, నర్సింగ్ అధికారిణి శ్రావణి సూచించారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని వసతులు, రికార్డులు, పరిసరాలు, రోగుల రిజిష్టర్‌లను పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఆస్పత్రిలో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలన్నారు. ఫార్మసిస్ట్ శ్వేత, జూనియర్ అసిస్టెంట్ లిఖిత, వైద్యులు అజయ్‌కుమార్, ప్రదీప్‌కుమార్, రఘు, సూపరింటెండెంట్ బాబు పాల్గొన్నారు.

ప్యాక్స్ చైర్మన్లను కొనసాగించాలని కోర్టు ఉత్తర్వులు



ఇల్లంతకుంట(మానకొండూర్): మండలంలోని గాలిపల్లి, ఇల్లంతకుంట ప్యాక్స్ పాలకవర్గాన్ని కొనసాగించాలని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఇల్లంతకుంట, గాలిపల్లి ప్యాక్స్ పాలకవర్గం పదవీకాలం ముగిసిందని, రద్దు చేస్తూ ఈనెల 7న జిల్లా సహకారసంఘం వారు స్పెషలాఫీసర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీన్ని సవాల్ చేస్తూ ఇల్లంతకుంట, గాలిపల్లి పాలకవర్గం హైకోర్టును ఆశ్రయించింది. ఈమేరకు హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఆ కాపీని ఇల్లంతకుంట ప్యాక్స్ మాజీ చైర్మన్ తిరుపతిరెడ్డి బుధవారం డీసీవో రామకృష్ణకు అందజేశారు. దీనిపై జిల్లా కో-ఆపరేటివ్ అధికారి రామకృష్ణను వివరణ కోరగా తమ కార్యాలయానికి హైకోర్టు ప్రతి అందలేదని తెలిపారు.

టీకాల కేంద్రం తనిఖీ



వేములవాడరూరల్: వేములవాడ మండలం మర్రిపల్లి ఆరోగ్య ఉపకేంద్రంలో వ్యాధి నిరోధక టీకాల కేంద్రాన్ని డీఎంహెచ్‌వో రజిత బుధవారం తనిఖీ చేశారు. అప్పుడే పుట్టిన శిశువు నుంచి ఐదేళ్ల వరకు ఇచ్చే వ్యాధి నిరోధక టీకాల వివరాలు, ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలపై సిబ్బందికి వివరించారు. డీఐవో డాక్టర్ సంపత్‌కుమార్, డీడీఎం కార్తీక్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డెత్‌లైన్ బెట్టింగ్!





ఒంటరి గువ్వలు



బండి స్వప్న, ఇద్దరు పిల్లలు



బండి స్వామి (ఫైల్)

ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామానికి చెందిన బండి స్వామి(28) ఆటో నడపడంతోపాటు ఎల్లారెడ్డిపేటలో పాల డెయిరీ పెట్టుకున్నాడు. ఈక్రమంలో ఏర్పడ్డ పరిచయాలతో ఆన్‌లైన్ బెట్టింగ్‌లో రూ.18లక్షలు పోగొట్టుకున్నాడు. నిండా మునగడంతో పాలడెయిరీ, ఆటోలను సైతం అమ్మేశాడు. అయినా అప్పులు తీరకపోవడంతో మనోవేదనకు గురై 2024 నవంబర్ 11న పురుగుల మందు తాగి ప్రాణాలు కోల్పోయాడు. స్వామి మృతితో భార్య స్వప్న, ఇద్దరు పిల్లలు సాద్విన్, వర్షిత ఒంటరివారయ్యారు. స్వప్న ప్రస్తుతం బీడీలు చుదుతుండగా.. వారికి ఆసరాగా స్వామి తండ్రి లక్ష్మీనారాయణ మిర్చీ బండి పెట్టుకొని కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు.

బలైన విద్యార్థి



తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లికి చెందిన సిరికొండ నిఖిల్‌రావు(22)హైదరాబాదులో అగ్రికల్చర్ బీఎస్సీ థర్డ్ ఇయర్ చదువుతున్నాడు. ఆన్‌లైన్ గేమ్స్ ఆడి భారీ ఎత్తున డబ్బులు పోగొట్టుకున్నాడు. దీంతో మనస్తాపం చెంది 10 రోజుల క్రితం గ్రామంలోని ఓ వ్యవసాయబావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాగా చదువుకొని కుటుంబానికి ఆసరాగా ఉంటాడనుకున్న కొడుకు ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బలికావడంతో ఆ తల్లిదండ్రులు తట్టుకోలేకపోతున్నారు.

ఈజీమనీ వల.. జీవితాలు విలవిల

- అప్పుల ఊబిలోకి లాగుతున్న అత్యాశ
- మనీ సంపాదించవచ్చనే ప్రకటనలకు ఆకర్షణ
- బెట్టింగ్‌యాప్‌లు, ఆన్‌లైన్ ట్రేడింగ్‌లలో పెట్టుబడులు
- నిండా మునిగాక బయటకు రాలేకపోతున్న యువత
- ప్రాణాలు తీసుకుంటున్న వైనం
- రోడ్డున పడుతున్న కుటుంబాలు

బెట్టింగ్ యాప్‌లలో డబ్బులు పెడితే నిమిషాల్లోనే ఐదింతలు..పదింతలు అవుతాయనే ప్రకటనలు.. ఆన్‌లైన్ ట్రేడింగ్ చేస్తే క్షణాల్లోనే మీ జీవితాలు మారుతాయనే యాడ్స్.. యువతను ఆకర్షిస్తున్నాయి. చదువుకునే విద్యార్థులు.. అప్పుడప్పుడే జీవితాల్లో స్థిరపడుతున్న యువత.. పిల్లాపాపలతో కుటుంబాలను నెట్టుకొస్తున్న మధ్యవయసు వారు.. అందరూ బాధితులే. కష్టపడి సంపాదించిన సొమ్మును బెట్టింగ్ యాప్‌లు, ఆన్‌లైన్ ట్రేడింగ్‌లు, ఐపీఎల్ బెట్టింగ్‌లలో పెడుతూ నిండా మునుగుతున్నారు. పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయి బయటకు రాలేక ప్రాణాలు తీసుకుంటున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాదిలో దాదాపు 10 మంది వరకు ఆత్మహత్య చేసుకున్నారు. ఇటీవల రాష్ట్రంలో బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తున్న యూట్యూబర్లు.. ఇన్‌ఫ్లుయన్సర్లు.. బుల్లితెర..వెండితెర నటీనటులపై కేసులు నమోదవుతున్న నేపథ్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బెట్టింగ్‌యాప్‌లు, ఆన్‌లైన్ ట్రేడింగ్ బాధిత కుటుంబాల పరిస్థితిపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

– సాక్షి,పెద్దపల్లి/కరీంనగర్ టౌన్/ఎల్లారెడ్డిపేట/తిమ్మాపూర్/శంకరపట్నం

సిటీలకే పరిమితమైన బుకీలు పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లోనూ బెట్టింగ్ దందా సాగిస్తున్నారు. వీరి ఆధ్వర్యంలో స్థానికంగా ఉండే వారిని ఏజెంట్లుగా నియమించుకుంటున్నారు. వీరు బెట్టింగ్‌లకు పాల్పడే వారిని గుర్తించి ఫోన్ నంబర్లతో టెలిగ్రామ్ గ్రూపు ఏర్పాటు చేస్తున్నారు. ఇలా చేసినందుకు ఏజెంట్లకు కమీషన్ల రూపంలో భారీగానే ముట్టజెప్పుతున్నారు. బెట్టింగ్‌లకు పాల్పడేవారు ఇతరులకు అర్థంకాకుండా కోడ్ భాషలు ఉపయోగిస్తున్నారు. కోడ్‌ల ప్రకారం బెట్టింగ్‌లు పెడుతున్నారు. గతేడాది ఐపీఎల్ సీజన్ పూర్తయ్యాక వచ్చిన డబ్బులతో గోదావరిఖనికి చెందిన బెట్టింగ్ నిర్వాహకులు పోలీసులకు చిక్కడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.

కేసులు నమోదైతే చిక్కులు తప్పవు

గతంలో బెట్టింగ్‌లో పట్టుబడితే వారిపై పెట్టి కేసులు నమోదు చేసేవారు. ప్రస్తుతం పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేస్తున్నారు. పోలీసుల రికార్డులో పేరు, చిరునామా, ఎలాంటి నేరానికి పాల్పడ్డారు అనే వివరాలు ఉంటున్నాయి. ఒక్కసారి కేసు నమోదైతే ప్రభుత్వ ఉద్యోగం లేదా విదేశాలకు వెళ్లాల్సి వస్తే ఇబ్బందులు తప్పవు. ప్రైవేటు కంపెనీలు సైతం ఉద్యోగావకాశాలు ఇవ్వవు.

ఇలా గుర్తించండి

బెట్టింగ్‌యాప్ బాధితులు ఎక్కువగా స్నేహితులు, కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటారని పలు సర్వేలు తెలుపుతున్నాయి. ఎక్కువ సమయం ఫోన్‌లో లీనం కావడం, తెలిసిన వారు, స్నేహితుల వద్ద అప్పులు చేయడం, ఇంట్లో వారికి తెలియకుండానే డబ్బులు తీసుకెళ్లడం వంటివి చేస్తుంటారు.

ఇలా ఫిర్యాదు చేయండి

తెలంగాణలో ఆన్‌లైన్ బెట్టింగ్ నిషేధం. బెట్టింగ్‌కు పాల్పడిన, ప్రోత్సహించినా, సహకరించినా చట్టరీత్యా చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. బెట్టింగ్‌పై ఆన్‌లైన్‌లో www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయవచ్చు. అంతేకాకుండా టోల్‌ఫ్రీ నంబర్ 1930లోనూ కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చు.



పెద్దపల్లి జిల్లాలో కొన్ని సంఘటనలు

- 2025 మార్చి 21న మంథని మండలం విలోచవరం గ్రామానికి చెందిన సాయి తేజ ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడటంతో రూ.6లక్షల వరకు అప్పుల పాలయ్యాడు. ఇంట్లో విషయం తెలియడంతో మళ్లీ బెట్టింగ్‌ల జోలికి వెళ్లనని హామీ ఇవ్వగా నమ్మిన కుటుంబసభ్యులు అప్పులు తీర్చారు. తిరిగి సాయి తేజ బెట్టింగ్‌లకు పాల్పడి రూ.4లక్షల వరకు అప్పులు చేశాడు. అప్పులు తీర్చలేక ఆత్మహత్య చేసుకున్నాడు.
- 2024 జూలై 4న సుల్తానాబాద్‌లో రాత్రి వేళ వాహనాలు తనిఖీ చేస్తుండగా.. రూ.33.10 లక్షల నగదుతో బెట్టింగ్ యాప్ నిర్వాహకులు పట్టుబడ్డారు. దీంతో ముగ్గురిపై కేసు నమోదు చేసి, ఐదు ఫోన్లు సీజ్ చేశారు.
- సుల్తానాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఒకరు క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడి సుమారు రూ.5లక్షల వరకు నష్టపోయాడు. అవి తీర్చేందుకు లోన్ యాప్స్‌లో అప్పులు చేశాడు. తల్లిదండ్రులకు తెలిసి మందలించడంతో మళ్లీ అటువైపు వెళ్లలేదు. ఐపీఎల్ పేరుతో ప్రతీ ఇంటిలోకి తొంగి చూస్తున్న బెట్టింగ్ భూతం బారినపడకుండా కుటుంబసభ్యులే రక్షించాల్సిన అవసరం ఉంది.

చెట్టంత కొడుకు పోయాడు



కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం గద్దపాక గ్రామానికి చెందిన భూస కార్తీక్ అనే యువకుడు రెండు నెలల క్రితం గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన భూస శంకరయ్య-స్వరూప దంపతులకు కార్తీక్ ఒక్కగానొక కొడుకు. పెరిగిపెద్దయి అండగా ఉంటానుకున్న కొడుకు రూ. 6 లక్షలు బెట్టింగ్‌లో పోగొట్టాడు. మనోవేదనతో జమ్మికుంట రైలు పట్టాలపై ఆత్మహత్య చేసుకున్నాడు. బెట్టింగ్‌కు బానిసైన కొడుకు చనిపోయాడని.. చదువుకొని ఉద్యోగం చేస్తాడని ఆశపడితే కడుపుకోతే మిగిలిందని తల్లిదండ్రులు బోరుమన్నారు.

ఎవరూ వాటి జోలికి పోవద్దు

ఎవరూ కూడా ఆన్‌లైన్ బెట్టింగ్ జోలికి పోవద్దు. అవన్నీ మోసపూరితమైనవే. ఆన్‌లైన్ ఊబిలోకి కూరుకుపోయిన వారు ఎవరూ బాగుపడలేదు. నా భర్త తెలియక డబ్బులు పెట్టి నిండా మునిగాడు. చివరికి ప్రాణాలు సైతం తీసుకున్నాడు. మేము ఒంటరివారమయ్యాం. ఇలాంటి ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. మాలాంటి బాధిత కుటుంబాలను ఆదుకోవాలి.

– బండి స్వప్న, సింగారం

తల్లిదండ్రులు నిఘా పెట్టాలి



ఐపీఎల్ బెట్టింగ్‌పై నిఘా ఉంచాం. అన్ని పోలీస్‌స్టేషన్లలో అప్రమత్తం చేశాం. తల్లిదండ్రులు తమ పిల్లలు ఏం చేస్తున్నారు అనే విషయాలపై నిఘా పెట్టాలి. బెట్టింగ్‌లతో జీవితాలు ఛిన్నాభిన్నం అవుతాయి. కేసులు నమోదైతే భవిష్యత్‌లో ఇబ్బందికరంగా ఉంటుంది. ఎవరూ వాటి జోలికి వెళ్లకూడదు.

– కరుణాకర్, డీసీపీ పెద్దపల్లి

మానసిక ఒత్తిడితోనే



ఈజీగా డబ్బు సంపాదించాలే ఆశతో యువత బెట్టింగ్ ప్రారంభిస్తారు. మొదట డబ్బులు వస్తుంటే ఆశతో ముందుకెళ్తారు. ఆ తర్వాత నష్టపోతుంటే అప్పులు భారంగా మారి అసాధారణమైన మానసిక ఒత్తిడికి గురవుతారు. ఆర్థిక నష్టాలు వ్యక్తిగత జీవితం, కుటుంబ సంబంధాలపై ప్రభావం చూ పుతాయి. ఈ ఒత్తిళ్లు వారికి అదనపు భయం, ఒంటరితనంతో ఆత్మహత్య ఆలోచనలు కలుగుతాయి. ఇలాంటి వారిని గుర్తించి వారు ఒత్తిడిని జయించాలంటే కుటుంబ సభ్యులు, స్నేహితులు సమర్థవంతమైన మద్దతు ఇవ్వాలి. మానసిక వైద్యులతో కౌన్సెలింగ్ ఇప్పించాలి.

– ప్రీతి, సైకియాట్రిస్టు

మహిళా సాధికారత దిశగా ధాన్యం కొనుగోళ్లు

- శుభ్రం చేసిన ధాన్యాన్ని కేంద్రాలకు తేవాలి
- అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్ల: మహిళా సాధికారత దిశగా జిల్లా అడుగులు వేస్తోందని, అందులో భాగంగానే ఇందిర క్రాంతి పథం(ఐకేపీ) ద్వారా మహిళా సంఘాల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లు చేపడుతున్నామని అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో యాసంగి సీజన్ ధాన్యం కొనుగోళ్లపై బుధవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రైతులు పండించిన వరి ధాన్యాన్ని పూర్తిగా శుభ్రం చేసిన తర్వాతనే కొనుగోలు కేంద్రాలకు తెచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. క్వింటాలు 'ఏ' గ్రేడ్ ధాన్యానికి రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300 మద్దతు ధరగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. ఐకేపీ ఆధ్వర్యంలో 172, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 57, డీసీఎంఎస్, మెప్మా ఆధ్వర్యంలో ఆరు కేంద్రాల చొప్పున ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. డీఆర్‌డీవో శేషాద్రి, డీఎస్‌వో పి.వసంతలక్ష్మి, డీసీవో రామకృష్ణ, పౌరసరఫరాల డీఎం రజిత, జిల్లా వ్యవసాయాధికారి రామారావు, ఏపీడీ గొట్టె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షకు 14 మంది గైర్హాజరు

- తనిఖీ చేసిన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



పరిశీలిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్లక్రైం/తంగళ్లపల్లి(సిరిసిల్ల): పదో తరగతి పరీక్షల్లో భాగంగా బుధవారం నిర్వహించిన గణిత పరీక్షకు 14 మంది గైర్హాజరుకాగా.. 6,753 మంది హాజరయ్యారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా తంగళ్లపల్లిలోని జెడ్పీ హైస్కూల్, మైనారిటీ రెసిడెన్షియల్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. డీఈవో జనార్దన్‌రావు ఇల్లంతకుంట ఉన్నత పాఠశాల, గాలిపెల్లి, కేరళ మోడల్ హైస్కూల్, తంగళ్లపల్లి పరీక్షా కేంద్రాలను సందర్శించారు.

రాజ్యాంగాన్ని రక్షించుకుందాం

- సిరిసిల్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి



ఎల్లారెడ్డిపేటలో మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి(సిరిసిల్ల): రాజ్యాంగాన్ని రక్షించుకుందామని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండల కేంద్రాల్లో బుధవారం నిర్వహించిన 'జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్' కార్యక్రమంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం 14 నెలల్లో రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేసిందన్నారు. జిల్లా కోఆర్డినేటర్ జావిద్ మాట్లాడుతూ కులగణన చేపట్టి బీసీ రిజర్వేషన్లను 42 శాతం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రతీ గ్రామంలో ప్రచారం చేయాలని కోరారు. ప్రోగ్రాం ఇన్‌చార్జి జగన్మోహన్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ సాబేర బేగం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గౌస్, డీసీసీ కో ఆర్డినేటర్ లింగారెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాములునాయక్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు హరిలాల్‌నాయక్, కరీంనగర్ గిరిజన విభాగం కోఆర్డినేటర్ గజానంలాల్ తదితరులు పాల్గొన్నారు.

కష్టమర్ల సహకారంతో బ్యాంకు అభివృద్ధి



మాట్లాడుతున్న రాపెల్లి లక్ష్మీనారాయణ

- అర్బన్ బ్యాంకు చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ

సిరిసిల్లటౌన్: వినియోగదారుల సహకారంతో బ్యాంకు అభివృద్ధి చెందుతోందని సిరిసిల్ల అర్బన్‌బ్యాంకు చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. సిరిసిల్ల పద్మశాలీ కల్యాణ ట్రస్టు భవనంలో బుధవారం నిర్వహించిన అర్ధ సంవత్సర సభలో మాట్లాడారు. సహకార స్ఫూర్తితో కష్టమర్లకు పారదర్శక సేవలు, సభ్యులకు డివిడెండ్‌ను అందిస్తున్నట్లు తెలిపారు. సభ్యుల నుంచి సూచనలు కోరగా.. బియ్యంకార్ శ్రీనివాస్ మాట్లాడుతూ బ్యాంకులో చాలా రోజులుగా ఖాళీగా ఉంటున్న సీఈవో పోస్టును భర్తీ చేయాలని, సభ్యులు చనిపోతే దహన సంస్కారాల ఖర్చులకు రూ.5వేలు ఇవ్వాలని కోరారు. రాగుల జగన్ మాట్లాడుతూ.. బ్యాంకును, సహకార వ్యవస్థను తప్పుదోవ పట్టిస్తూ నిబంధనలు అతిక్రమించి పాలకవర్గంలో భాగస్వాములైన వారి నుంచి డబ్బులు రికవరీ చేయాలని కోరారు. రిటైర్డ్ ఉద్యోగిని సీఈవోగా కొనసాగించవద్దని, ఎల్లారెడ్డిపేట బ్యాంకు లెక్కలను విడిగా చూపించాలని కోరారు. బ్యాంకు వైస్‌చైర్మన్ అడ్డగట్ల మురళి, డైరెక్టర్లు గుడ్ల సత్యానందం, చొప్పదండి ప్రమోద్, పాటి కుమార్‌రాజు, బుర్ర రాజు, వేముల సుక్కమ్మ, అడ్డగట్ల దేవదాసు, ఎనగందుల శంకర్, వలుస హరిణి, పత్తిపాక సురేష్, కోడం సంజీవ్, సీఈవో పత్తిపాక శ్రీనివాస్, మాజీ చైర్మన్లు గూడూరి ప్రవీణ్, గాజుల నారాయణ, దార్నం లక్ష్మీరాజం తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు ఇందిరమ్మ ఇళ్లు

- ముంపు గ్రామాల్లో చిగురిస్తున్న ఆశలు
- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- ఏప్రిల్ 11 వరకు గడువు
- క్షేత్రస్థాయి విచారణ అనంతరం కేటాయింపు



కొదురుపాక గ్రామం

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు నిర్వాసితులకు ఇందిరమ్మ ఇళ్లు దక్కనున్నాయి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 26 నుంచి ఏప్రిల్ 11 వరకు అవకాశం కల్పించింది. ఈ విషయాన్ని కలెక్టర్ సందీప్‌కుమార్ ప్రకటించారు. దీంతో నిర్వాసిత కుటుంబాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఆర్అండ్ఆర్ కాలనీల్లో ప్లాట్లు వచ్చి వివిధ కారణాలతో ఇల్లు నిర్మించుకోని వారికి ప్రాధాన్యత ఉంటుందని సమాచారం.

మిడ్‌మానేరులో 11 ముంపు గ్రామాలు

బోయినపల్లి మండలం మాన్వాడలో నిర్మించిన మిడ్‌మానేరు ప్రాజెక్టులో బోయినపల్లి, వేములవాడ, తంగళ్లపల్లి మండలాలకు చెందిన కొదురుపాక, వరదవెల్లి, శాభాష్‌పల్లి, రుద్రవరం, అనుపురం, కొడుముంజ, ఆరెపల్లి, సంకెపల్లి, గుర్రంవానిపల్లి, చీర్లవంచ, చింతలఠాణా గ్రామాలు ముంపునకు గురయ్యాయి. ఆయా గ్రామాల్లో 10,683 పీడీఎఫ్(ప్రాజెక్టు డిస్‌ప్లేస్‌డ్ ఫ్యామిలీస్)గా ప్రభుత్వం గుర్తించింది. గతంలో ప్రభుత్వం ఆర్అండ్ఆర్ కాలనీలు ఏర్పాటు చేసి ఒక్కో నిర్వాసిత కుటుంబానికి 242 చదరపు గజాల ఇంటిస్థలం పట్టా, ఇంటి ప్యాకేజీ ఇచ్చింది. ఇప్పటికే చాలా కుటుంబాలు ఇళ్లు నిర్మించుకున్నాయి. మిడ్‌మానేరు ముంపు గ్రామాల్లో 4,696 కుటుంబాలు ఇళ్లు నిర్మించుకోలేదు. 5,987 కుటుంబాలు పునరావాస గ్రామాల్లో ఇళ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నాయి.

ఇవీ జతచేయాలి

ఆన్‌లైన్‌లో ఏప్రిల్ 11 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. దరఖాస్తు చేసుకునే సమయంలో ఆధార్‌కార్డు, తెల్లరేషన్‌కార్డు, ఆర్అండ్ఆర్‌లో పీడీఎఫ్ పట్టా, స్థలం, సైట్ ఫొటో, దరఖాస్తుదారు పాస్‌పోర్టు సైజ్ ఫొటో, అవార్డు కాపీ, కుటుంబసభ్యుల వివరాలు, వారి ఆధార్ కార్డుల వివరాలతో దరఖాస్తు చేసుకోవాలి. అనంతరం క్షేత్రస్థాయిలో అధికారులు విచారణ చేపట్టి నివేదిక ఇస్తారు. దీని ఆధారంగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తారు. ప్రభుత్వ నిర్ణయంపై మిడ్‌మానేరు ముంపు గ్రామాల్లో హర్షం వ్యక్తమవుతోంది.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి



ముంపు గ్రామాల్లో అర్హత గల ఇండ్లు లేని ప్రజలు మీసేవా కేంద్రాల ద్వారా జిల్లా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఈనెల 26వ తేదీ నుంచి ఏప్రిల్ 11వ తేదీలోపు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

– సందీప్‌కుమార్ ఝా, కలెక్టర్

క్లుప్తంగా

బాలుడి మృతదేహం లభ్యం

గొల్లపల్లి: మండలంలోని రంగదామునిపల్లి గ్రామంలోని రిజర్వాయర్‌లో మంగళవారం గ్రామానికి చెందిన బాలుడు నేరెల్ల నరేశ్ (12) గల్లంతు అయ్యాడు. బుధవారం మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. గ్రామానికి చెందిన నరేశ్ రిజర్వాయర్‌లో ఈతకు వెళ్లి ఇందులో పడి గల్లంతయ్యాడు. ఈత రాకపోవడంతో ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడని తండ్రి నేరెల్ల పోచయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకొని కాంట్రాక్టు కార్మికుడి ఆత్మహత్య


శివశంకర్ మృతదేహం

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖనిలో కాంట్రాక్టు కార్మికుడు అవాంచ శివశంకర్(42) బుధవారం ఇంట్లోని ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు...గాంధీనగర్‌కు చెందిన శివశంకర్ ఎన్టీపీసీలో కాంట్రాక్టు కార్మికుడిగా పని చేస్తున్నాడు. తండ్రి చనిపోయినప్పటి నుంచి ఒంటరిగా ఉంటూ మానసికంగా బాధపడుతున్నాడని, ఈ క్రమంలోనే ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని మృతుని భార్య లహరి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఒకరి ఆత్మహత్య


రాము మృతదేహం

సిరిసిల్లక్రైం: సిరిసిల్ల పట్టణంలోని మార్కండేయవీధికి చెందిన చౌటపల్లి రాము (42) బుధవారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలు. కుటుంబ కలహాలతో కొద్ది రోజుల క్రితం రాము భార్య పుట్టింటికి వెళ్లింది. ఇంటిలో ఎవరూ లేని సమయాన్ని చూసి మనస్థాపనతో ఉరివేసుకున్నాడు. మృతునికి భార్యతోపాటు పదేళ్లలోపు ఉన్న ఇద్దరు కొడుకులు ఉన్నారు.

షెడ్లు సిద్ధం.. అందని మగ్గం

- 'వర్కర్ టు ఓనర్' పథకంపై నేతన్నల ఆశలు
- కార్మికుడు యజమాని అయ్యేదెప్పుడో ?
- మార్గదర్శకాల ఊసే లేదు..మగ్గాల జాడే లేదు
- 2017లో అప్పటి సీఎం కేసీఆర్ శంకుస్థాపన
- రూ.374 కోట్లతో 88.03 ఎకరాల్లో సిరిసిల్ల వీవింగ్ పార్క్



"పవర్‌లూమ్స్ నడుపుతున్న ఇతను సిరిసిల్ల పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన మామిడాల సమ్మయ్య వయస్సు 48 సంవత్సరాలు. గత 28 ఏళ్లుగా నేతకార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఇతని తండ్రి చేనేత మగ్గాలను జీవితకాలం నడిపాడు. రోజూ 10 నుంచి 12 గంటల పాటు 8 పవర్‌లూమ్స్‌పై పాలిస్టర్ బట్టను ఉత్పత్తి చేస్తే వారానికి రూ.1,600 నుంచి రూ.2వేలు వస్తాయి. సమ్మయ్య సంపాదన బట్టకు, పొట్టకే సరిపోతుంది. ఇలాంటి వారికి నాలుగు సాంచాలు(మగ్గాలు) ప్రభుత్వం ఇస్తే.. అసాములు లేకుండానే నేరుగా డబుల్‌కూలీ (రెండింతల ఆదాయం) లభిస్తుంది. సమ్మయ్య లాంటి వారికి సొంత సాంచాలు ఉన్నాయనే ధైర్యంతో మెరుగైన జీవనం సాగించేందుకు అవకాశం ఉంటుంది. ఆ నాలుగు సాంచాలు ఇచ్చేందుకు ప్రభుత్వం ముందుకురావడం లేదు. ఇది ఒక్క సమ్మయ్య పరిస్థితి కాదు.. సిరిసిల్లలో పనిచేస్తున్న 25వేల మంది కార్మికుల దుస్థితి."


పెద్దూరు శివారులో వీవర్‌పార్క్ షెడ్లు

సిరిసిల్ల: పాలకులు మారినప్పుడల్లా అభివృద్ధి స్వరూపం మారిపోతుంటుంది. అభివృద్ధి.. సంక్షేమ ప్రాధాన్యతలు మారుతుంటాయి. దీని ప్రభావం సిరిసిల్ల నేతకార్మికులపై స్పష్టంగా కనిపిస్తోంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నేత కార్మికులకు శాశ్వత ఉపాధి కల్పించే 'వర్కర్ టు ఓనర్' పథకం ఇప్పుడు మూలనపడింది. కార్మికులను యజమానులుగా మార్చే బృహత్ కార్యం అప్రధాన్యతగా మారింది. సిరిసిల్ల ఎమ్మెల్యే, అప్పటి రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ శాఖ మంత్రి కె.తారక రామారావు సిరిసిల్లలో నేత కార్మికులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఈ పథకాన్ని రూపొందించారు. 2017 అక్టోబరు 11న అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌తో శంకుస్థాపన చేయించారు. రూ.374కోట్ల భారీ బడ్జెట్‌తో దేశంలోనే తొలిసారిగా వీవర్స్‌పార్క్‌కు శ్రీకారం చుట్టారు. కానీ ఇప్పుడు ప్రభుత్వం మారడంతో 'వర్కర్ టు ఓనర్' పథకంపై నీలినీడలు కమ్ముకున్నాయి.

ఆధునిక వసతులతో నిర్మాణం

తెలంగాణ రాష్ట్ర పరిశ్రమల, మౌలిక వసతుల కల్పన సంస్థ(టీఎస్ఐఐసీ) ఆధ్వర్యంలో వీవర్స్ పార్క్ నిర్మాణమైంది. 2023లోనే ఇక్కడ రోడ్లు, వీధిదీపాలు, మురికికాల్వలు, ప్రహరీల పనులు పూర్తయ్యాయి. వర్కర్లు పని చేసేందుకు 48 షెడ్లు నిర్మించారు. కానీ అందులో మగ్గాలను ఏర్పాటు చేయలేదు. నేతకార్మికులు కోటి ఆశలు పెట్టుకున్న ఈ పథకంపై ఇప్పుడు నీలినీడలు కమ్ముకున్నాయి. ప్రయోగాత్మకంగా రెండు సెమీ ఆటోమేటిక్ లూమ్స్‌ను, మరో స్పన్‌వైండింగ్ మిషన్‌ను ఏర్పాటు చేశారు. నాణ్యత, నవ్యతతో కూడిన వస్త్రాలను ఉత్పత్తి చేసే లూమ్స్‌ను ఏర్పాటు చేస్తారు. ఒకేసారి నాలుగు రంగుల నూలుతో అనేక డిజైన్లతో వస్త్రాన్ని ఉత్పత్తి చేసి ప్రపంచస్థాయిలో వస్త్రాన్ని వీవర్స్ పార్క్‌లో ఉత్పత్తి చేసేలా ప్రణాళిక సిద్ధం చేశారు.

జారీకాని మార్గదర్శకాలు

సిరిసిల్లలో 'వర్కర్ టు ఓనర్' పథకానికి ఇంకా స్పష్టమైన మార్గదర్శకాలు జారీకాలేదు. తొలి విడతగా 1,104 మంది పేద కార్మికులను ఎంపిక చేస్తామని 2023లో అధికారులు ప్రకటించారు. ఒక్కో కార్మికుడికి రెండు సెమీ ఆటోమేటిక్, మరో రెండు జకార్డ్ లూమ్స్‌ను, ఒక్క స్పన్ వైండింగ్ మిషన్ ఇస్తారు. ఒక్కో షెడ్డులో 96 లూమ్స్, 24 స్పన్‌వైండింగ్ మిషన్స్‌ను అమర్చేలా ప్రణాళిక సిద్ధం చేశారు. కానీ ఆ లూమ్స్‌ను కొనుగోలు చేయలేదు. లబ్ధిదారుల ఎంపిక విధానం ప్రకటించకపోవడంతో సిరిసిల్ల నేతన్నల్లో నిరాశ నెలకొంది. తొలుత ఎంపికైన కార్మికులు ప్రాజెక్టు వ్యయంలో పది శాతం చెల్లిస్తే.. 50 శాతం ప్రభుత్వ రాయితీ, మరో 40 శాతం బ్యాంకు రుణం అందించే విధంగా ప్రాజెక్టు రిపోర్టును సిద్ధం చేశారు.


షెడ్డులో ఏర్పాటు చేసిన సెమీ ఆటోమేటిక్ లూమ్స్

ఇదీ పథకం స్వరూపం
స్థలం: పెద్దూరు వద్ద 88.03 ఎకరాలు
నిధులు : రూ.373 కోట్లు
ఇప్పటికీ చేసిన ఖర్చు : రూ.210 కోట్లు
మొత్తం వర్క్‌షెడ్లు : 48
ఇప్పటికీ పూర్తయినవి : 40
ఒక్కో షెడ్డు విస్తీర్ణం : 23వేల చదరపు అడుగులు
వార్పిన్ షెడ్లు : 04
తొలివిడతగా లబ్ధిపొందే కార్మికులు : 1104
ఆధునిక మరమగ్గాలు : 4416
ఇప్పటికీ బిగించిన లూమ్స్ : 04

కార్మికులను యజమానులను చేయాలి



సిరిసిల్లలో ఎన్నో పోరాటాల ఫలితంగా నేతకార్మికులను యజమానులుగా చేయాలనే ప్రాజెక్టుకు అడుగులు పడ్డాయి. 'వర్కర్ టు ఓనర్' పథకాన్ని అమలు చేస్తే మొదటి దశలోనే 1104 మంది కార్మికులకు మెరుగైన ఉపాధి లభిస్తుంది. ఈ పథకంపై పేద నేతకార్మికులు ఆశలు పెట్టుకున్నారు. ప్రభుత్వం వెంటనే నిర్మాణం పూర్తయిన షెడ్లల్లో సాంచాలు ఏర్పాటు చేసి ఈ పథకాన్ని అమలు చేయాలి.

– మూషం రమేశ్, పవర్‌లూమ్ కార్మిక సంఘం నాయకుడు

ప్రాసెస్ జరుగుతోంది

సిరిసిల్ల బైపాస్‌రోడ్డులో వీవర్స్‌పార్క్ నిర్మాణాలు దాదాపు పూర్తయ్యాయి. మౌలిక వసతులు పూర్తయ్యాయి. పార్క్‌లో మోడల్‌లూమ్స్ నాలుగు బిగించాము. వాటిని ట్రయల్ రన్ చేశాం. ఈ పథకం ప్రాసెస్ జరుగుతోంది. కార్మికులకు అందించాల్సిన లూమ్స్ కొనుగోలు చేయాల్సి ఉంది. అది పూర్తయితే వర్కర్ టు ఓనర్ పథకం అమలులోకి వస్తుంది.

– వెంకటేశ్వర్‌రావు, చేనేత, జౌళిశాఖ సీజీఎం

నాలుగు ఇళ్లలో చోరీ


చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న సీఐ లక్ష్మీనారాయణ

మానకొండూర్: అన్నారం గ్రామంలో మంగళవారం రాత్రి నాలుగిళ్లలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఇంటి తాళాలు పగలగొట్టి బంగారు, వెండి, ఓ ద్విచక్ర వాహనాన్ని ఎత్తుకెళ్లారు. మానకొండూర్ సీఐ లక్ష్మీనారాయణ వివరాల ప్రకారం.. గొట్టిముక్కల విజయ ఇంట్లో నిద్రిస్తుండగా.. బంగారు పుస్తెల తాడు అపహరించారు. మధునాల వెంకటమ్మ ఇంట్లో 55 తులాల వెండి, రూ.20వేల నగదు, రుద్రోజు వెంకటాచారి ముప్పావు తులం బంగారం, 18 తులాల వెండి పట్టీలు, పాకాల రాజిరెడ్డి ఇంటి ఎదుట ఉన్న స్కూటీని ఎత్తుకెళ్లారు. ఘటనా స్థలానికి చేరుకున్న సీఐ, క్లూస్ టీం పోలీసులు పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మిర్చి యార్డులో..


కెమెరాలు పరిశీలిస్తున్న క్లూస్ టీమ్ సీఐ, సిబ్బంది

తిమ్మాపూర్: మండల కేంద్రంలోని మిర్చియార్డ్‌లో చోరీ జరిగింది. సుమారు రూ.80 వేలు దొంగిలించారని యజమాని శ్రీనివాస్, అంజయ్య తెలిపారు. ఇద్దరు దొంగలు రాత్రివేళ చోరీకిపాల్పడినట్లు సీసీ కెమెరాలో రికార్డు అయింది. యజమాని శ్రీనివాస్, ఆంజనేయులు ఇచ్చిన ఫిర్యాదుతో ఎల్ఎండీ ఎస్ఐ వివేక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం క్లూస్‌టీంకు సమాచారం అందించగా సీఐతో సిబ్బంది సీసీ కెమెరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పలు ఆధారాలను సేకరించి విచారణ చేపడతామని తెలిపారు.

రికవరీ ఆఫీసర్ కార్యాలయం
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్-1, హైదరాబాద్ వద్ద
3వ అంతస్తు, త్రివేణి కాంప్లెక్స్, అబిడ్స్, హైదరాబాద్ - 500001.

ఫారం నం.13

అమ్మకం ప్రకటన

(రికవరీ ఆఫ్ డెట్స్ డ్యూ టూ బ్యాంక్స్ అండ్ ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్స్ యాక్ట్, 1993తో చదువబడే ఆదాయ పన్ను చట్టం, 1961కి రెండవ షెడ్యూలులోని రూల్ 38, 52(2) క్రింద)

O.A.No.90/2019లో R.P.No.171/2023

వీరి మధ్య:
తెలంగాణ గ్రామీణ బ్యాంక్, దొంగతుర్తి బ్రాంచ్,
దొంగతుర్తి గ్రామం మరియు పోస్ట్,
ధర్మారం మండలం, పెద్దపల్లి జిల్లా - 505187 ...సర్టిఫికెట్ హోల్డర్
మరియు
శ్రీ పాలకుర్తి సత్తయ్య ...సర్టిఫికెట్ డెటార్

తెలంగాణ గ్రామీణ బ్యాంక్, దొంగతుర్తి బ్రాంచ్, పెద్దపల్లి జిల్లా మరియు శ్రీ పాలకుర్తి సత్తయ్య మధ్య రికవరీ ఆఫ్ డెట్స్ అండ్ బ్యాంక్రప్సీ యాక్ట్, 1993లోని సెక్షన్ 19 (22) క్రింద గౌరవ ప్రిసైడింగ్ ఆఫీసర్, డెట్స్ రికవరీ ట్రిబ్యునల్-1, హైదరాబాద్ వారిచే O.A.No.90/2019లో R.P.No.171/2023 ప్రకారం రికవరీ సర్టిఫికెట్ జారీ చేయబడినది మరియు అమలు కోసం దిగువ సంతకందారుకు అది పంపబడినది.

2. ఆదాయ పన్ను చట్టం 1961కి రెండవ మరియు మూడవ షెడ్యూళ్ళ క్రింద రికవరీ సర్టిఫికెట్‌లో నిర్దిష్టపరిచిన రూ.10,74,450/- (పది లక్షల డెబ్బై నాలుగు వేల నాలుగు వందల యాభై రూపాయలు మాత్రమే)తో పాటు వడ్డీ, వ్యయాలు మొ॥వాటిని దిగువ తెలిపిన సర్టిఫికెట్ డెటార్స్ నుండి రాబట్టుకునేందుకు O.A.No.90/2019లో R.P.No.171/2023 ప్రకారం దిగువ సంతకందారు రికవరీ ప్రొసీడింగ్స్ చేపట్టారు.

1. శ్రీ పాలకుర్తి సత్తయ్య తండ్రి శ్రీ నరసయ్య, వృత్తి: వ్యవసాయం,
నివాసం: ఇ.నం.1-29, దొంగతుర్తి గ్రామం, ధర్మారం మండలం, పెద్దపల్లి జిల్లా. ...సర్టిఫికెట్ డెటార్

3. రికవరీ సర్టిఫికెట్ సంతృప్తి మేరకు దీనికి జతచేసిన షెడ్యూల్‌లో తెలిపిన తనఖాపెట్టిన/ జప్తుచేయబడిన ఆస్తి అమ్మకానికి దిగువ సంతకందారు ఆదేశించారు.

4. ఒరిజినల్ దరఖాస్తు దాఖలు తేదీ నుండి 30.04.2025 (అమ్మకానికి నిర్ణయించిన తేది) నాటికి రూ.10,74,450/- (పది లక్షల డెబ్బై నాలుగు వేల నాలుగు వందల యాభై రూపాయలు మాత్రమే)తో పాటు వడ్డీ, వ్యయాలు మొ.వి బకాయిగా ఉంటాయి.

5. ఏదైనా ఉత్తర్వు వాయిదా లేకపోతే, సదరు ఆస్తి సర్వీస్ ప్రొవైడర్ వెబ్‌సైట్ https://auctiontiger.net or drt.auctiontiger.net ద్వారా ఆన్‌లైన్ ఇ-వేలం ద్వారా 30.04.2025న మ.12.00 గం. మరియు 12.30 గం. మధ్య ఆటో ఎక్స్‌టెన్షన్ నిబంధన అంటే ఇ-వేలం ముగింపు సమయంలో వేలం ముగింపునకు ముందు చివరి 3 నిమిషాలలో బిడ్ వేస్తే ప్రతిసారి 3 నిమిషాల పొడిగింపుతో దిగువ సంతకందారుచే విక్రయించబడునని ఇందుమూలంగా **నోటీసు** ఇవ్వడమైనది.

6. బిడ్డింగ్ సర్వీస్ ప్రొవైడర్ **మెసర్స్ ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెక్నాలజీస్ లిమిటెడ్ (ఆక్షన్ టైగర్), బి-705, వాల్‌స్ట్రీట్-II, ఒరియంట్ క్లబ్ ఎదురుగా, గుజరాత్ కాలేజ్ దగ్గర, ఎల్లిస్ బ్రిడ్జ్, అహ్మదాబాద్-380006, గుజరాత్** - వారి వెబ్‌సైట్ https://auctiontiger.net or drt.auctiontiger.net ద్వారా "ఆన్‌లైన్ ఎలక్ట్రానిక్ బిడ్డింగ్" ద్వారా ఉంటుంది - శ్రీ ఎం. ప్రవీణ్ థేవర్, మేనేజర్, మొబైల్ నం.9722778828, ఇ-మెయిల్: praveen.thevar@auctiontiger.net

7. ఆన్‌లైన్ ఇ-వేలం బిడ్ ఫారం, డిక్లరేషన్, ఆన్‌లైన్ వేలం అమ్మకం సాధారణ నియమ నిబంధనలు కలిగిన ఇ-వేలం టెండరు డాక్యుమెంట్ https://auctiontiger.net or drt.auctiontiger.netలో లభించును.

8. సర్టిఫికెట్ డెటార్స్ పేరున గల ఆస్తి అమ్మకం ఉంటుంది మరియు ఆస్తి షెడ్యూల్‌లో నిర్దిష్టపరచబడిన వాటిలోనివి సదరు ఆస్తికి జత చేయబడిన రుణబాధ్యతలు మరియు క్లెయిమ్‌లు ఇప్పటివరకు సేకరించబడినవి.

9. షెడ్యూల్‌లో నిర్దిష్టపరిచిన లాట్‌లలో అమ్మకం కొరకు ఆస్తి ఉంచబడినది. అమ్మకం ద్వారా వసూలు కావలసిన మొత్తం ఒకవేళ ఆస్తి యొక్క భాగం అమ్మకం ద్వారా నెరవేరితే సంబంధిత మిగిలిన వాటికి సంబంధించి అమ్మకం వెంటనే నిలిపివేయబడును. పైన తెలిపిన సర్టిఫికెట్‌లో పేర్కొన్న మొత్తం పైన పేర్కొన్న సర్టిఫికెట్ ప్రకారం చెల్లించవలసిన వడ్డీ మరియు వ్యయాలు (అమ్మకం వ్యయంతో సహా) అమ్మకం నిర్వహించు అధికారికి చెల్లించినా లేదా అట్టి మొత్తం, వడ్డీ మరియు వ్యయాలు దిగువ సంతకందారుకు చెల్లించినట్లు అతని సంతృప్తి మేరకు రుజువు చూపినా, ఏదైనా ఆస్తి లాట్ కొట్టివేయబడే ముందు కూడా అమ్మకం నిలిపివేయబడును.

10. ఈ అమ్మకానికి సంబంధించి విధులు నిర్వహిస్తున్న ఏ అధికారి లేదా ఇతర వ్యక్తి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా బిడ్ వేయరాదు, విక్రయించబడిన ఆస్తిలో ఎటువంటి ప్రయోజనం పొందరాదు లేదా పొందేందుకు ప్రయత్నం చేయరాదు. అమ్మకం ఆదాయ పన్ను చట్టం 1961కి 2వ షెడ్యూలులో నిర్దేశించిన నిబంధనలు మరియు ఆదాయ పన్ను సర్టిఫికెట్ ప్రొసీడింగ్స్ రూల్స్ 1962 మేరకు చేయబడే రూల్స్ మరియు దిగువ తెలిపిన నిబంధనలకు లోబడి ఉంటుంది:-

i) జతపర్చిన షెడ్యూలులో నిర్దేశించిన వివరాలు దిగువ సంతకందారు సమాచారం మేరకు పేర్కొనబడినవి. అయితే ఈ ప్రకటనలో ఏదేని పొరపాటు, తప్పుడు స్టేట్‌మెంట్ లేదా వదిలివేసిన దానికి దిగువ సంతకందారు జవాబుదారీ కారు.

ii) రిజర్వు ధర రూ.15,00,000/- (పదిహేను లక్షల రూపాయలు మాత్రమే) కంటే తక్కువకు ఆస్తి విక్రయించబడదు.

iii) పెంచుకొనబడే బిడ్డింగ్ మొత్తాలు రూ.20,000/- (ఇరవై వేల రూపాయలు మాత్రమే) లేదా అట్టి గుణకాలలో ఉంటాయి.

iv) బిడ్ దరఖాస్తు దాఖలుకు మరియు బయానా చెల్లింపునకు చివరి తేది 28.04.2025న సా. 4.30 గం.లోగా.

v) బిడ్డర్లు తాము ఎంచుకున్న ప్రదేశం నుంచి బిడ్డింగ్ కోసం ఇ-వేలంలో పాల్గొనవచ్చును. బిడ్డరు తనంతటతాను ఇంటర్‌నెట్ కనెక్టివిటీ కలిగి ఉన్నట్లుగా ధృవీ చేసుకోవాలి. ఇంటర్‌నెట్ కనెక్టివిటీ, నెట్‌వర్క్ సమస్యలు, సిస్టమ్ క్రాష్‌డౌన్, విద్యుత్ వైఫల్యం మొ॥ వాటి కోసం DRT/ బ్యాంక్/ సర్వీస్ ప్రొవైడర్ బాధ్యత వహించరు.

vi) అత్యధిక బిడ్డరు ఆస్తి కొనుగోలుదారుగా ప్రకటించబడతారు. అయితే అతను ఎల్లప్పుడూ బిడ్ వేయడానికి లీగల్‌గా అర్హత కలిగి ఉండాలి మరియు అయితే తదుపరి అతను వేసే బిడ్ మొత్తం రిజర్వు ధర కంటే తక్కువగా ఉండరాదు. ఆఫరు చేసిన ధర తగినంత లేదని స్పష్టంగా కనిపించినపుడు అవిధంగా చేయడం సరిఅయినది కాదు కనుక అత్యధిక బిడ్ అంగీకారాన్ని తిరస్కరించడం దిగువ సంతకందారు విచక్షణాధికారం మేరకు ఉంటుంది.

vii) ఒక లాట్ కంటే ఎక్కువ ఉంటే, ప్రతీ లాట్ కోసం విడిగా రిజర్వు ధరలో 10% వంతున బయానా మొత్తాన్ని బయానా ఖాతా నం.79073063538లో జమకు IFSC కోడ్: TGRB0000224 ద్వారా తెలంగాణ గ్రామీణ బ్యాంక్, నల్లకుంట బ్రాంచ్, హైదరాబాద్ వారికి RTGS/ NEFT/ FUND Transfer ద్వారా చెల్లించాలి లేదా Recovery Officer, DRT-I, Hyderabad పేరున డిమాండ్ డ్రాఫ్ట్/ పే ఆర్డర్ ద్వారా PAN కార్డు కాపీ, చిరునామా రుజువు మరియు గుర్తింపు రుజువు, ఇ-మెయిల్ ఐడి, మొబైల్ నంబరుతో పాటు చెల్లించాలి మరియు కంపెనీ అయితే, ప్రాతినిధ్యాన్ని నిర్ధారించే డాక్యుమెంట్లు మరియు సదరు డిపాజిట్ యొక్క రసీద్/ కౌంటర్ ఫాయిల్‌ను రికవరీ ఆఫీసర్ కార్యాలయంలో దాఖలు చేయాలి.

viii) కాబోయే బిడ్డర్లు ఆస్తి వివరాలు తెలుసుకోడానికి మరియు షెడ్యూలు ఆస్తి తనిఖీ కోసం కూడా శ్రీ దోనపాటి విష్ణు, బ్రాంచ్ మేనేజర్, దొంగతుర్తి బ్రాంచ్, దొంగతుర్తి గ్రామం మరియు పోస్ట్, ధర్మారం మండలం, పెద్దపల్లి జిల్లా - 505187, మొబైల్ నం.9959279130, 9491041835 వారిని సంప్రదించగలరు.

ix) కాబోయే బిడ్డర్లు బ్యాంక్ వద్ద టైటిల్ డీడ్స్ కాపీలను చదువుకోవలసిందిగా మరియు ఇటీవలి తాకట్టు రుణభారాల సర్టిఫికెట్ మరియు ఇతర రెవెన్యూ/ మున్సిపల్ రికార్డులను తగినంత జాగ్రత్తగా పరిశీలించవలసిందిగా మరియు ఆస్తిపై టైటిల్ మరియు తాకట్టు రుణభారాలు ఏమైనా ఉంటే వాటి గురించి తమంతతాము సంతృప్తి చెందవలసిందిగా సూచించడమైనది.

x) పైన పేరా 'vii'లో తెలిపిన వివరాల ప్రకారం సదరు ఖాతాలో పాట కొట్టివేసిన పిదప బయానా మొత్తాన్ని సర్దుబాటు చేసిన తర్వాత తుది బిడ్ మొత్తంలో 25%తో పాటు తుది బిడ్ మొత్తంలో రూ.1000/- వరకు 2% వంతున మరియు సదరు మొత్తం రూ.1000/- కంటే ఎక్కువ ఉంటే 1% వంతున పౌండేజీ ఫీజును కూడా గెలుపొందిన బిడ్డరు వేలం మరుసటి రోజులోగా మ.3.00 గం.లోగా డిపాజిట్ చేయాలి. మరుసటి రోజు ప్రభుత్వ సెలవుదినం, రెండవ శనివారం లేదా ఆదివారం అయితే మరుసటి మొదటి పనిరోజున డిపాజిట్ చేయాలి.

xi) గెలుపొందిన బిడ్డరు ఆస్తి అమ్మకం తేదీ నుండి 15వ రోజున లేదా అలోగా, ఆరోజు మినహా లేదా 15వ రోజు రెండవ శనివారం, ఆదివారం లేదా ప్రభుత్వ సెలవు దినమైతే, 15వ రోజు తర్వాత మొదటి పనిరోజున పైన పేరా 'vii'లో తెలిపిన నిర్దేశిత విధానంలో అమ్మకం రాబడులలో మిగతా 75% డిపాజిట్ చేయాలి.

xii) పైన తెలిపిన గడువులోగా చెల్లించడంలో విఫలమైతే, అమ్మకం యొక్క తాజా ప్రకటన జారీ చేసిన తర్వాత ఆస్తి తిరిగి విక్రయించబడుతుంది. అమ్మకం వ్యయాలు సర్దుబాటు చేసిన తర్వాత డిపాజిట్‌ను దిగువ సంతకందారు తగినదని భావిస్తే ప్రభుత్వానికి స్వాధీనం చేస్తారు మరియు డిఫాల్టింగ్ కొనుగోలుదారు తదుపరి విక్రయించే ఆస్తికి లేదా అందులోని ఏదేని భాగం మొత్తానికి అన్ని క్లెయిమ్‌లను కోల్పోతారు.

xiii) అమ్మకం ద్వారా వసూలు కావలసిన మొత్తం ఆస్తి యొక్క భాగం అమ్మకం ద్వారా నెరవేరితే, మిగతాదానికి సంబంధించి అమ్మకం వెంటనే నిలిపివేయబడును. పైన తెలిపిన సర్టిఫికెట్‌లో పేర్కొన్న మొత్తం పైన పేర్కొన్న సర్టిఫికెట్ ప్రకారం చెల్లించవలసిన వడ్డీ మరియు వ్యయాలు (అమ్మకం వ్యయంతో సహా) అమ్మకం నిర్వహించే అధికారికి చెల్లించిన లేదా దిగువ సంతకందారుకు అట్టి మొత్తం, వడ్డీ మరియు వ్యయాలు చెల్లించినట్లు అతని సంతృప్తి మేరకు రుజువు చూపినా ఏదైనా ఆస్తి లాట్ కొట్టివేసేముందు నిలిపివేయబడును.

xiv) ఆస్తి **"ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలా", "ఉన్నది ఉన్నట్లుగా" మరియు "అక్కడ ఏమున్నదో అదే"** ప్రాతిపదికపై విక్రయించబడును.

సేల్ డీడ్ నం. 344/1988 ప్రకారం శ్రీ పాలకుర్తి సత్తయ్య, సర్టిఫికెట్ డెటార్‌కు చెందిన ఆస్తి షెడ్యూలు

పెద్దపల్లి రిజిస్ట్రేషన్ జిల్లా, సుల్తానాబాద్ రిజిస్ట్రేషన్ ఉప జిల్లా, దొంగతుర్తి గ్రామపంచాయతీ పరిధిలోని ధర్మారం మండలంలోని దొంగతుర్తి రెవెన్యూ గ్రామం వద్దగల సర్వే నం.238/3లోని ఎ.0.03 గుంటలు లేదా 0.03 హెక్టార్లు, సర్వే నం.239/1-ఎ లోని ఎ.0.11 గుంటలు లేదా 0.11 హెక్టార్లు, సర్వే నం.510/సి లోని ఎ.0.06 గుంటలు, మొత్తం ఎ.0.20 గుంటల విస్తీర్ణం గల తడి వ్యవసాయ భూమి యావత్తు మరియు సరిహద్దులు:- తూర్పు: ఆర్. చంద్రయ్య భూమి, పశ్చిమం: వాగు, ఉత్తరం: ఎం. మల్లయ్య భూమి, దక్షిణం: పి. గట్టు రాజయ్య భూమి.

హైదరాబాద్ వద్ద ఈ ట్రిబ్యునల్ సీలుతో **10 మార్చి, 2025**న నాచే స్వయంగా ఇవ్వబడింది.

(ఎం. వెంకటేశ్వర్ గౌడ్)
రికవరీ ఆఫీసర్
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్-1, హైదరాబాద్

రాజన్న హుండీ ఆదాయం రూ.1.95కోట్లు


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

వేములవాడ: రాజన్నకు 20 రోజుల్లో రూ.1,95,75,168 నగదుతోపాటు 287 గ్రాములు బంగారం, 18.500 కిలోల వెండి సమకూరినట్లు ఈవో కొప్పుల వినోద్‌రెడ్డి తెలిపారు. గుడి ఓపెన్‌స్లాబ్‌లో బుధవారం సీసీ కెమెరాల నిఘా మధ్య లెక్కించారు. నాంపల్లి శ్రీలక్ష్మీ నరసింహస్వామి హుండీ ఆదాయం ఆరు నెలలకు రూ.11,47,510 వచ్చినట్లు ఈవో తెలిపారు.

వనరుల దోపిడీ ఆపాల్సిందే..

- పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్


మాట్లాడుతున్న ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, ప్రజాసంఘాల నాయకులు

పెద్దపల్లిరూరల్: దేశంలోని బడా కార్పొరేట్ శక్తులకు సహజవనరుల సంపదను దోచుకునేలా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అడుగులు వేస్తోందని పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ ఆరోపించారు. పెద్దపల్లిలో బుధవారం సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కనారాయణరావుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. అటవీ సంపదను దోపిడీ చేసేకుట్రలో భాగంగానే మహిళలపై అత్యాచారాలను సాగిస్తోందని ఆరోపించారు. ఆదివాసీల హక్కులను కాపాడి వారికి అండగా ఉండేందుకు అన్నివర్గాల ప్రజలు రక్షణగా నిలవాలని కోరారు. ఛత్తీస్‌గఢ్‌లో ఆదివాసీల హననాన్ని ఆపేయాలని, మహిళలపై అత్యాచారాలను నిలిపేయాలని, దండకారణ్యంలో పోలీసు క్యాంపులు ఎత్తేయాలని, పర్యావరణాన్ని కాపాడాలని తీర్మానించారు.

కరీంనగర్‌లో ఏప్రిల్ 20న సభ..

ఆదివాసీహక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో ఏప్రిల్ 20న కరీంనగర్‌లో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, నక్క నారాయణరావు ప్రకటించారు. నాయకులు సదానందం, శ్రీనివాస్, వెంకన్న, రాజమల్లన్న, బాపన్న, రవి, రవీందర్, సదానందం, వినోద్, సంపత్ పాల్గొన్నారు.

అయ్యో క్యూటీ వెళ్లిపోతున్నావా..

- ఇసుక ట్రాక్టర్ ఢీకొని పెంపుడు కుక్క మృతి
- అశ్రునయనాల మధ్య ఖననం
- డ్రైవర్‌పై కేసు


రోదిస్తున్న తండ్రీకొడుకులు బాలలింగం, హరీశ్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): అయ్యో.. క్యూటీ వెళ్లిపోతున్నావా.. పొద్దున లేస్తే నిన్నే.. పడుకుంటే నిన్నే పిలుద్దుమూ.. ఇప్పుడు ఎవరినీ పిలువమంటావు.. అంటూ ఆ కుటుంబ సభ్యులు రోదించారు. చిన్నపిల్లగా ఉన్నప్పుడు ఇంటికి తెచ్చుకుని సాదుకున్నామని.. దిక్కుమల్లా ఇసుక ట్రాక్టర్ నీ ప్రాణాలు తీసుకెళ్లిందా.. అంటూ కన్నీటిపర్యంతమయ్యారు. పెంపుడు కుక్క క్యూటీని ఇసుక ట్రాక్టర్ ఢీకొనడంతో ప్రాణాలు కోల్పోయిన సంఘటన రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌లో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు. వెంకటాపూర్‌కు చెందిన కంకనాల బాలలింగం క్యూటీ అనే కుక్కను సాదుకుంటున్నాడు. ఆ కుక్క కుటుంబ సభ్యులలో ఒకరిగా మెదిలేది. అయితే బుధవారం ఇసుక ట్రాక్టర్ ఢీకొనడంతో ఆ కుక్క చనిపోయింది. బాలలింగం కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకొని రోదించిన తీరు కలచివేసింది. అనంతరం కుక్కను ఖననం చేశారు. కుక్క మృతికి బాధ్యుడైన ఇసుక ట్రాక్టర్ డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలంటూ ఎల్లారెడ్డిపేట ఎస్సై రమాకాంత్‌కు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదుతో క్యూటీ మృతికి కారణమైన ఇసుక ట్రాక్టర్ డ్రైవర్ మామిండ్ల వెంకటేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

భూసార పరీక్షలు ఏమైనట్టో..

- మూలకుపడ్డ మినీ భూసారకిట్లు
- సరఫరా లేని రసాయనిక కిట్లు
- నేల రకాలపై రైతులకు అవగాహన కరువు


రైతువేదికలో మూలనపడ్డ పరికరాలు

చందుర్తి(వేములవాడ): పంటల్లో అధిక దిగుబడులు సాధించాలంటే రైతులకు వారి భూములపై అవగాహన ఉండాలి. ఏ పంటలు వేస్తే ఆ నేలకు అనుకూలమో తెలియాలి. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ క్లస్టర్‌కు భూసార పరీక్షల కిట్లు అందించింది. వీటి ద్వారా భూసార పరీక్షలు చేసి ఆ భూమిలో ఏ పంటలు వేయాలో రైతులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత వ్యవసాయాధికారులది. కానీ కొన్నేళ్లుగా భూసార పరీక్షలు చేయడం లేదు.

42 క్లస్టర్లకే మినీ భూసార కిట్లు

మినీ భూసార పరీక్ష కేంద్రాలను 2018లో ప్రారంభించారు. జిల్లాలోని 57 క్లస్టర్లు ఉండగా 42 క్లస్టర్లకే మినీ భూసారకిట్లు వచ్చాయి. రెండేళ్లపాటు సేవలందించాయి. ఇందులో కేంద్రం 40 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 60 శాతం వ్యయాన్ని కేటాయించేవారు. ప్రారంభించిన రెండేళ్లకే మట్టిపరీక్షలకు కావాల్సిన రసాయనిక కిట్లను అందజేయకపోవడంతో పరికరాలు రైతువేదికల్లో మూలనపడ్డాయి.

మట్టి నమూనాలు సేకరించే విధానం

- పొలంలోని మట్టిని ప్రతీ మూడేళ్లకోసారి పరీక్షలు చేయించుకోవాలి.
- 'వీ' ఆకారంలో 15 సెం.మీ. వరకు పారతో గుంట తీయాలి. అందులో పైపార నుంచి కింది పార వరకు ఒక పక్కన ఉన్న మట్టిని మాత్రమే సేకరించాలి.
- మట్టిలో రాళ్లు, రప్పలు, పంట వేర్లు, మొదళ్లు లేకుండా చేసుకొని నీడలో ఆరబెట్టాలి.
- ఎకరం విస్తీర్ణంలో 8 నుంచి 10 చోట్ల మట్టిని సేకరించాలి.
- ఆ మట్టిని ఒక చోట చేర్చి బాగా కలిపి 4 భాగాలు చేయాలి.
- అందులోని ఎదుటి భాగాలను తీసుకుని, మిగతా భాగాలు తీసేయాలి.
- అర కిలో మట్టి వచ్చే వరకు చేయాలి. దానిని ఒక చోట చేర్చుకోవాలి.
- గట్ల దగ్గర, పంట కాల్వల్లోని మట్టిని సేకరించరాదు.
- చెట్ల కింద ఉన్న పొలంలో నుంచి మట్టిని సేకరించరాదు.
- పశువుల పేడ, కంపోస్టు, వర్మీకంపోస్టు, పచ్చిరొట్ట ఎరువులు కుప్ప పోసిన చోట మట్టిని సేకరించరాదు.
- ఎప్పుడు నీరు నిల్వ ఉండే పల్లపు ప్రాంతంలోని మట్టిని సేకరించరాదు.

భూసార పరీక్షలు చేయాలి



రైతులు ఏటా సంప్రదాయ పంటలు సాగుచేస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారు. పంటల్లో అధిక దిగుబడి కోసం విచ్చలవిడిగా రసాయనిక ఎరువులను వినియోగిస్తున్నారు. పెట్టుబడుల ఖర్చు రెండింతలు పెరిగిపోతుంది. జాతీయ సుస్థిర వ్యవసాయాభివృద్ధి పథకంలో భాగంగా భూసార పరీక్షలు నిర్వహించి, కార్డులను అందజేస్తే వాటికి అనుగుణంగా రైతులు పంటలు సాగుచేస్తారు.

– పెంటయ్య, రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు

ఎలాంటి ఆదేశాలు రాలేదు

గ్రామస్థాయిలో భూసార పరీక్షల చేపట్టేందుకు కావాల్సిన పరికరాలు ఉన్నాయి. కానీ పరీక్షలు చేయాలని ఎలాంటి ఆదేశాలు అందలేదు. రైతువేదికలో మినీ భూసార కిట్లు ఉన్నాయి. రసాయనిక కిట్లను అందజేస్తే పరీక్షలు చేస్తాం. భూసార పరీక్షలకు అనుగుణంగా పంటలు సాగు చేసుకుంటే రైతులకు ప్రయోజనం కలుగుతుంది.

– రామారావు, ఇన్‌చార్జి జిల్లా వ్యవసాయాధికారి

మా కులం పేర్లు మార్చండి సారూ...

- సమాజంలో అవమానానికి గురవుతున్నాం
- బీసీ కమిషన్ ఛైర్మన్ ఎదుట పలు కులాల ప్రతినిధుల ఆవేదన


రాజన్నను దర్శించుకున్న అనంతరం అధికారులతో బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్, సభ్యులు

సిరిసిల్ల/వేములవాడ: 'మా కులం పేర్లు మార్చండి సారూ.. ఎక్కడైనా చెప్పుకోవడానికి ఇబ్బందిగా ఉందని.. మా కులాల పేరు మార్చేలా చర్యలు తీసుకోవాలని పలు కులాల ప్రతినిధులు రాష్ట్ర బీసీ కమిషన్ ఎదుట వాపోయారు. బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్, కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మి బుధవారం రాజన్నసిరిసిల్ల జిల్లాలో పర్యటించారు. ముందుగా వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామికి దర్శించుకున్నారు. అనంతరం సిరిసిల్లలోని ఇందిరానగర్, గీతానగర్‌లలో పర్యటించారు. పలు కులాల వారితో సమావేశమయ్యారు. పిచ్చగూంట్ల, బుడబుక్కల, దొమ్మరి, తమ్మలి కులాల వారు తమ కులాల పేర్లను మార్చాలని కమిషన్ సభ్యులకు విన్నవించారు. తమ్మల కులానికి శూద్ర, నాన్ బ్రాహ్మణ్ పేరిట కులం సర్టిఫికెట్ ఇవ్వడంతో ఆలయాల్లో అర్చక, ఇతర ఉద్యోగాలు పొందేందుకు ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. తమకు తమ్మల పేరిట కులం సర్టిఫికెట్ ఇవ్వాలని కోరారు. దొమ్మరి కులం పేరును సర్టిఫికెట్‌లో గాడే వంశీయులుగా మార్చాలని కోరారు. వారి ఉపాధి మార్గాలు, ఆదాయం, విద్యాస్థితిపై కమిషన్ ఛైర్మన్ ఆరా తీశారు. కులం పేరు దొమ్మరి ఉండడంతో విద్యాలయాలు, ప్రభుత్వ సంస్థల్లో అవమానానికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సిరిసిల్ల ఇందిరానగర్‌లోని పిచ్చగూంట్ల(వంశరాజ్) పలువురు ఇండ్లలోకి వెళ్లి మాట్లాడారు. వారు చేస్తున్న పని, ఆదాయం తదితర వివరాలు తెలుసుకున్నారు. తమ కులస్తులవి 46 ఇండ్లు ఉన్నాయని, పిచ్చగూంట్ల అని చెప్పుకునేందుకు ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పూరిండ్లలో ఉంటున్న వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కమిషన్ ఛైర్మన్ నిరంజన్ అధికారులను ఆదేశించారు. మురికి నీటి సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ సమ్మయ్యకు సూచించారు.

బీసీ రిజర్వేషన్లు వర్తించని వారికి ప్రాధాన్యం ఇవ్వాలి

బీసీ రిజర్వేషన్ ఫలాలు ఇప్పటి వరకు వర్తించని బీసీ కులాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. కులం పేరిట ఇబ్బంది పడుతున్నవారు ఆత్మన్యూనత భావానికి గురికావద్దని, పిల్లలను చదివించాలని తెలిపారు. రాజీవ్ యువ వికాసం కోసం దరఖాస్తు చేసుకోవడంలో ఇబ్బందులు పరిష్కరించేందుకు జిల్లాలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని సూచించారు. సిరిసిల్ల ఆర్డీవో రాధాభాయ్, తహసీల్దార్ మహేశ్‌కుమార్, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, జిల్లా బీసీ సంక్షేమాధికారి రాజమనోహర్‌రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో కొప్పుల వినోద్‌రెడ్డి, అర్చకులు వారికి ఘనస్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణల అనంతరం వేదోక్త ఆశీర్వచనం గావించారు.